తెలుగు కళాసమితి (న్యూజెర్సీ)వారి 1986 మినీ కథల పోటీలో సాధారణ ప్రచురణకు ఎన్నికైన కథ

# పేపర్ వెయిట్

## అఫ్సర్

ఇంకో మూడు గంటలైతే తెల్లారుతుంది. అయినా అతనికి నిద్ర పట్టటం లేదు. వేధిస్తున్న ఆలోచనల మధ్య గడపడం చాలా అసహనంగా వుంది.

చీకట్లో గడియారం కొట్టుకుంటున్న చప్పుడు మినహా మరేమీ వినిపించడం లేదు. బెడ్‌లైట్ వెలుగులో పక్కనే నిదరోతున్న సరస్వతి, ఇంకో పక్క ముదుచుకు పడుకున్న బాబు అస్పష్టంగా కనిపిస్తున్నారు.

నిద్ర రాని కళ్ళను విసుగ్గా నులుముకుంటూ లేచి కూర్చున్నాడు. చేతులు వొళ్ళోకి లాక్కుని కొద్ది సేపు మంచం మీదనే వుండిపోయాడు. దుప్పటి పక్కకు తొలగించి మంచం మీంచి దిగి కుర్చీలో కూర్చున్నాడు.

ఏదో భావం తళుక్కున మెరిసినట్టు చటుక్కున టేబుల్ లైట్ స్విచ్ నొక్కాడు. కలం, కాగితం చేతిలోకి తీసుకుని రాయసాగాడు. కాలేజీలో చదివే రోజుల్లో సరస్వతిని ప్రేమించక ముందు, ప్రేమించిన తర్వాత పెళ్ళయిన కొద్ది రోజులు కూడా అతను కొంత కవిత్వం రాశాడు. పెళ్ళయి ఉద్యోగంలో చేరాక కలం, కాగితం అతనికి శత్రువుగా మారిపోయాయి. ఏదైనా పుస్తకం విప్పితే విసుక్కుంటాడు. ఇంట్లో టేబులు మీద కలం, కాగితం కనిపిస్తే చికాకు పడతాడు. ఉద్యోగంలో చేరాక అతని చూపు మారిపోయిందని స్థూలంగా చెప్పుకోవచ్చు.

పొద్దున్నే అరడజను మంది కవల పిల్లల్ని మోస్తున్న గర్భవతి లాటి సిటీబస్‌లో కండక్టర్ పాసింజర్లను చూసి ఎంత విసుక్కుంటాడో అతను అంత విసుక్కుంటాడు కలాన్నీకాగితాన్నీ చూసి - అలాంటి శ్రీధరానికి ఇవ్వాళ్టి రాత్రి కలం మీదా, కాగితం మీదా హడావుడిగా మమకారం పుట్టుకొచ్చింది. పొద్దుట్నుంచీఅతనిప్రవర్తనే అదోలాగా వుంది.

"ఆఫీసుకు వెళ్తారా? లేదా?" అంటూ సరస్వతి పొద్దున్న మంచం మీదనుంచి నిద్ర కళ్ళతో లేపినప్పుడు విసుక్కున్నాడు. స్నానానికి నీళ్ళు సిద్ధం చేసి మరో దండకం చదివి ఆహ్వానించినప్పుడు చికాకు పడ్డాడు. బాబి గాణ్ణి బడి దాకా వదిలి రమ్మంటే "ఛీ ... ఛీ... పాడు బతుకు" అంటూ అసహనాన్ని వ్యక్తం చేశాడు. మొత్తానికి అతని పద్ధతే మారి పోయింది.

పొద్దుట్నుంచీ స్నానం లేదు.

అన్నపానీయాలు లేవు. ఆఫీసుకు వెళ్ళాలన్న ధ్యాస అంతకన్నా లేదు. సిగరెట్ల మీద సిగరెట్లు కాల్చి పారేస్తూ కరుగుతున్న ఆ పొగని చూస్తూ అట్లా కుర్చీలో కాసేపు, మంచం మీద కాసేపు అశాంతిగా కదులుతూ వుండిపోయాడు.

అన్ని పనులూ చక్కబెట్టుకుని "ఆఫీసు మర్చిపోయారా? నేను వెళుతున్నాను" అంటూ బాబి గాణ్ణి తీసుకుని సరస్వతి కూడా తన ఆఫీసుకు వెళ్ళి పోయింది.


పెళ్ళికి ముందు ప్రేమించుకునే రోజులలో శ్రీధరం కవిత్వం అంటే సరస్వతికి చాలాచాలా ఇష్టంగా వుండేది. అతని ప్రత్యేకతను పదే పదే స్నేహితురాళ్ళతో చెప్పుకుని గర్వపడేది - జీవితం అంటే ఉద్యోగమూ, పెళ్ళాం, పిల్లలూ యివి మాత్రమే సర్వస్వమని భావించే 'చచ్చు' జంటలను తీవ్ర వాగ్దాటితో తూలనాడేదికూడా-

పెళ్లయిన కొత్తలో కూడా శ్రీధరం పట్ల సరస్వతి ధోరణి అత్యంత భావుకంగా వుండేది. ఆ భావుకతని, పచ్చదనాన్ని జీవిత కాలం నిలుపుకోవాలని పార్కులో కూర్చున్నప్పుడు, బీచి వొడ్డున కూర్చున్నప్పుడు, సరదాగా కలిసి నడుస్తున్నప్పుడు గట్టిగా అనుకునేవాళ్ళు. కారుల్లో షికారు కెళ్ళే వాళ్ళని, నాలుగ్గోడల మధ్య విడియో ముందు కూర్చొని ఇరుగ్గా ఆనందం అనుభవించేవాళ్ళని చూసి వాళ్ళు వాళ్ళ ధోరణిని, కుహనా సంస్కారాన్ని నిరసిస్తూ ఏకగ్రీవంగా తీర్మానాలు ఆమోదించేవాళ్ళు. ఆ రోజులే వేరు. అవి వాళ్ళ సొంతం. తిరిగి రాని వసంతం.

ఆలోచనల్లో పడి ఆఫీసు సంగతి మరచి పోలేదు శ్రీధరం. కావాలనే ఆఫీసుని మరచి పోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆ టేబులు, ఆ ఫైళ్ళు, ఆ జనం, ఆ ఆఫీసరు, ఆ మాటలు యివాళ అతనికి ఎంతఅసహ్యాన్నికలిగిస్తున్నాయో ఇంట్లో ఈ విడియో, ఈ యూ ఫోంబెడ్లూ, ఈ ఎయిర్ కూలరూ ఇవన్నీ కూడా అంతే అసహ్యాన్ని కలిగిస్తున్నాయి.

ఒక క్షణం శ్రీధరానికి కోపం వచ్చింది. ఆఫీసుని ఫైళ్ళతో సహా, అందులో జనంతోసహా తగలబెట్టాలనుకున్నాడు. ఇంటిని లోపల వున్న ప్రెస్టీజియస్ వస్తువులతో సహా నిప్పంటించాలనుకున్నాడు. చివరికి ఏమీ చేయలేక మరో సిగరెట్ వెలిగించి ఆలోచనలను తగలెడుతూ కూర్చున్నాడు.

ఇంట్లో కూర్చుంటే కోపం మరీ ఎక్కువై పోయి దేన్నయినా తగల బెడతానేమో నన్న అనుమానంతోనో ఏమో తటాలున బయటి కొచ్చేశాడు. చింపిరి జుత్తుతో తలైనా దువ్వు



కోకుండా నైట్ డ్రస్ మీద బయటికి వెళ్తున్న కొడుకుని చూసి కించిత్ ఆశ్చర్యంలో మునిగి పోయింది తల్లి శాంతమ్మ.

"ఏంరా! ఆఫీసుకు వెళ్ళడం లేదా?" అని మెల్లగా అడిగింది.

"ఆఫీసు లేదు, ఇల్లూ లేదు. కాసేపు నోర్మూసుకో" అని వుమ్మేసినట్లుగా తుపుక్కున అని బయట పడ్డాడు.

బయటికొచ్చిన శ్రీధరానికి ప్రపంచమంతా కుష్టు రోగుల ఆస్పత్రిలా కనిపించింది. ఎటు చూసినా జనం. ఎటు చూసినా బస్సులు. ఎటు చూసినా యంత్రాలు. ఎటు చూసినా మాయ, మోసం, దగా. అంతా ఒక కుట్ర. ప్రపంచ మంతా ఒక నాటక రంగం. ఒక్కొక్కడూ ఒక వెధవ. ఆఫీసరు వెధవ. ఆఫీసు వెధవది. పక్క డెస్కు పరాంకుశం వెధవ. పక్కింటి పరంధామం వెధవ. ఒక్కొక్కడూ ఒక్కొక్క రకం వెధవాయిత్వం మూర్తీభవించిన మహా నటుడు.

విసుగు పుట్టించిన ప్రపంచంతో వేగలేక మళ్ళీ ఇంట్లోకొచ్చి పడ్డాడు శ్రీధరం. కాలు గాలిన పిల్లిలాగా అటూ యిటూ పచార్లుచేశాడు.

"టీ ఇవ్వు"

అని తల్లి శాంతమ్మని ఆజ్ఞాపించాడు .

"ఇప్పుడేం టీ? భోజనం వేళయ్యింది భోం చేయరాదూ" అంది తల్లి ప్రశాంతంగా.

"ఎప్పుడూ తిండే తిండి. తిండి తప్ప మరో లోకం లేదు. టీ తీసుకురా" అన్నాడు విసుగ్గా.

మారు మాట్లాడకుండా కాసేపటికి టీ తెచ్చి అమాయకంగా అతని ముఖం లోకి చూసి ఆ ముఖం మీది ముడతలను విశ్లేషించి విఫలమై వెనుదిరిగింది తల్లి.

టీ తాగి నిద్రలోకి జారుకున్న శ్రీధరం తిరిగి నిద్ర మేల్కొనేసరికి సరస్వతి ఇంటి పనుల్లో హడావుడిగావుంది. బాబిగాడు విడియో చూస్తూ కూర్చున్నాడు. శ్రీధరం నిద్ర లేచాడని పసిగట్టి వొకసారి మంచందాకా వచ్చి అదోలా చూసి ఏమి అనకుండా వెనక్కి తిరిగి వంట గదిలో తన పనుల్లో మునిగిపోయింది సరస్వతి.

"టీ ఇవ్వు" అని పెద్దగా రంకేశాడు శ్రీధరం.

ఆ కేకకు టి.వి.లో క్రికెట్ చూస్తున్న బాబిగాడే వులిక్కి పడ్డాడు. ఏం ప్రళయం ముంచుకొచ్చిందో అనుకుంది కుర్చీలో కూర్చున్న శాంతమ్మ. ఏమిటీ ఆకస్మిక పరిణామమని కంగారు పడింది సరస్వతి.

టీ కప్పుచేతికిచ్చింది సరస్వతి. కప్పుచేతుల్లోకి తీసుకుని పెద్ద శబ్దం చేస్తూ వొక్క గుటకలో టీ తాగి "నా శ్రాద్ధంలా వుంది. ఏమిటీ కషాయం?"

అని దండకం చదివి, వృథా వృథా బతుకు వృథా వ్యధా వ్యధా బతుకు వ్యధా అనుకున్నాడు.

''బతుక్కి వో తలా తోకా లేకపోయింది. పాడు బతుకు, పాడు గోల'' అని గబుక్కున లేచి బాత్రూంలోకి వెళ్ళి ముఖం కడుక్కుని తాజాగా తయారై బయట పడ్డాడు.

* * *

రాత్రి ఇంటికి వచ్చేసరికి అంతా ముసగ దీసుకుని పడుకున్నారు. కిక్కురుమనకుండా నిద్రపోదామనుకున్న శ్రీధరానికి నిద్ర కరుణించలేదు. అయినా లైటార్పి పడుకునే ప్రయత్నం చేశాడు.గత్యంతరంలేక లేచికూర్చున్నాడు. గడియారం చూస్తే మూడవుతోంది. నిద్రయేమో రాదు. టీపాయ్ మీద వీక్లీ తీశాడు. పేజీలు అటూయిటూ తిప్పాడు. కొద్దిసేపయ్యాక వొకోపేజి చూస్తూ అక్కడక్కడా దర్శనమిచ్చిన కవితా పంక్తులను మొదటి లైనూ, చివరి లైనూ చదివేడు.

'వెధవలు. ప్రతీ వొక్కడూ కవిత్వం రాయడమే. అర్థం వుండదు పాడుండదు.' మళ్ళీ పడుకునే ప్రయత్నం చేశాడు. కాని ఫలితం లేదు. 'నిద్ర ఇక రాదు. దారి చూపే దిక్కు లేదా? ఏమిటో వృధా వ్యధా? 'అనుకున్నాడు.

ఆ యథార్థ దృశ్యంలోంచి వో వ్యధార్త గీతం వెలికి వచ్చింది. కృత్యాదవస్థను జయించి శ్రీధరం కాగితం తీసుకుని కలంతో పొలం దున్నినట్టు హడావుడి చేశాడు. కొద్ది సేపటికి యేదోరాసి దాన్ని కొన్ని లైన్లుగా కత్తిరించాడు. చూస్తుండగానే అది కవిత్వంగా మారిపోయింది.

కాస్తంత కసి తగ్గించుకుని

''ఓహ్ కవిత తయారైంది'' అన్నాడు ప్రకాశంగానే.

అతని ఆశ్చర్యానికి అంతులేదు. ఆనందానికి అవధి లేదు. మొద్దు నిద్రలో వున్న సరస్వతికి నిద్ర లేపి వినిపించాలనుకున్నాడు. అది విని సరస్వతి కళ్ళలో ఆనంద బాష్పాలు తొణికిసలాడుతాయా? ఆమె ఆనందాన్ని వ్యక్తం చేయడానికి మరో కవిత రాయాల్సి వస్తుందా?

కాని ఈ లోగానే

''అబ్బ అర్ధరాత్రీ అపరాత్రీ ఏమిటండీ ఈ దీపారాధన?'' అని విసుగ్గా అవి పక్కకు తిరిగి పడుకుంది సరస్వతి లైట్లుఆర్పేయమనిశాసిస్తూ. ఆమెని లేపి చెంప ఛెళ్ళుమనిపించి అయినా సరే కవిత్వం చదివి వినిపించాలన్న దుర్బుద్ధి పుట్టింది శ్రీధరానికి -

**అపరిచితులు**

కొన్ని ముఖాలు
మన జీవితాంతం అపరిచితాలే,
తమలో తాము
ముదుచుక జీవించేవే!

—నిఖిల్

అయినా తమాయించుకున్నాడు. వాడిగాణ్ని లేపి వాడి చెవిలో వినిపిస్తే...? ఛీ...ఛీ... ఇదేమిటి వెధవాలోచన? అనుకుని తన కవితకు తానే పాఠకుడిగా మారి కాసేపు తన యాంగిల్‌లో, కాసేపు ప్రపంచం యాంగిల్‌లోచదూకుని మురిసిపోయాడు. రేపీపాటికి తనకు బైరన్‌కు వచ్చినంత పేరు వచ్చేస్తుంది. అంతర్జాతీయ వేదికల మీద తన కవిత ప్రతిధ్వనిస్తుంది. సన్మానాలు జరుగుతాయి. ఆఫీసరు లోపల్లోపల కడుపు మండిపోతున్నా గత్యంతరం లేక నమస్కారం పెడతాడు. మేనేజర్ అడగ్గానే, ఒకోసారి అడక్కముందే శాలరీ అడ్వాన్స్ ఇస్తాడు. పక్కింటి పరంధామం, పక్కడెస్కు పరాంకుశం ఈ వాడా ఈ వూరూ ఈ దేశం ఈ మహాకవి నా వాడంటే నా వాడని జుట్టు పీక్కుని నెత్తురొచ్చేదాకా కొట్టుకు చస్తారు.

అప్పుడు శ్రీధరానికి హాయిగానిద్రపట్టింది.

* * *

పొద్దున్నే లేచిన శ్రీధరానికి ప్రపంచమంతా నవనవోన్మేషంగా కనిపించింది; పచ్చగా అనిపించింది. అంతా హాయిగా క్షేమంగా వుందనుకున్నాడు. మొగుడూ పెళ్ళాల్లేని, ఆఫీసరూ గుమాస్తాల్లేని, అత్తాకోడళ్ళులేని, పాలకులూ పాలితులూ లేని స్వప్న సామ్రాజ్యంలా కనిపించింది.

ALL IS WELL GOD IS IN HEAVEN అని పాడు కుంటూ కాలకృత్యాలు తీర్చుకుని టిఫిన్‌కోసం కూర్చున్నాడు. ఇంతలో రాత్రి తన విరచిత కళాఖండం స్మృతిలో మెదిలింది. ఉన్న పళాన టేబుల్‌మీంచి లేచి కాగితం తీసుకువచ్చేడు. సరస్వతి కోసం చుట్టూ చూశాడు.

''ఏమోయ్ సరూ! ఏమిటీ హడావుడి?'' అన్నాడు నవ్వుతూ.

సరస్వతి విపరీతంగా కంగారు పడిపోయి

''ఏదో లోకాల్లో విహరిస్తున్నారే'' అంది మెల్లిగా, కొంటెగా.

శ్రీధరం పెదవిలో ఒక చిర్నవ్వు రేఖ. చేతిలో వున్న కాగితాన్ని ఆమె సన్నిధిలో ప్రవేశ పెట్టాడు. ఆమె దాన్ని చూసీ చూడకుండా పక్కన పెట్టి కూరగాయలు తరుగుతూ కూర్చుంది.

అప్పటికే అదొక చిన్న సైజు అవమానంగా భావించిన శ్రీధరం విసుక్కోబోయి సంబాళించుకుని మళ్ళీ ఆ కాగితాన్ని రెపరెపలాడించాడు. ఆమెకేమీ అర్థం కాలేదు. కూర గాయలు తరగడమే ఏకైక లక్ష్యంగా వుందామెకు -

మరోసారి ఆమె దృష్టి కాగితం మీదికి మళ్ళించే ప్రయత్నంలో విఫలమైన శ్రీధరం చివరికి విసిగిపోయి''ఇది చదూతావా? చస్తావా?'' అన్నాడు ఆదేశపూర్వకంగా -

''ఏమిటీ గోల?'' అంది తీరికగా అతని లోకంలోకి వెళ్ళి.

శ్రీధరం సంతోషం సగం నీరు కారిపోయింది. చికాగ్గా చూశాడు.

''ఇప్పుడు చదువూ సంధ్య జాన్తానై. నాకూ మీకూ ఇవ్వాళ తీరికలేనన్ని పనులు.''

''.........''

''ఎప్పుడనగా చెబితే వింటున్నారా? ప్రతీదీ నేనే చూసుకోవడం ఎలాగా?''

''.........''

''వో పూట సెలవుపెట్టి ఇవ్వాళైనా ఆ వంట గ్యాస్ వచ్చేలా చూడండి.''

''.........''

''వాయిదాల మీద ఎవరో రిఫ్రిజిరేటర్ ఇస్తారని చెప్పారు. దాని సంగతి పట్టించుకోక పోయారు...''

''.........''

''ఆ బ్లాక్ అండ్ వైట్ టీవీ చూసీ చూసీ విసుగు పుడుతోంది. దాన్ని కలర్‌లోకిమార్పించడానికి బద్ధకం...''

ఆమె ధోరణి అలా సాగుతూనే వుంది. సరస్వతీ దేవి అని పేరు పెట్టిన తల్లిదండ్రులను మరొకసారి తిట్టుకుని కోపంవసాళానికంటుకున్న శ్రీధరం కవిత్వాన్ని చింపి పోగులు పెట్టి జుట్టు పీక్కుంటూ బయటపడ్డాడు...! ●